ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-11-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ప్రతీ ఇంటి నుంచి ఒకరు పారిశ్రామిక వేత్తగా ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు.

- రైతులకు సకాలంలో పంట నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.

- రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి 25 లక్షల రూపాయల వైద్య భీమా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

- భారత్, ఆస్ట్రేలియా క్రికెట్ జట్ల మధ్య జరిగిన ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ను భారత జట్టు 2-1 తేడాతో గెలుచుకుంది.

====================

విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో సీఐఐ సదస్సు నిర్మాణాత్మకంగా జరగనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈరోజు మంగళగిరిలో ముఖ్యమంత్రి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... క్వాంటమ్ కంప్యూటర్ గడువులోపే అమరావతికి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవినీతి నిర్మూలనకు సమగ్ర చర్యలు చేపడుతున్నామని, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చామని తెలిపారు. 22ఏ నిషేధిత జాబితా భూములపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు విధిగా ప్రజాదర్బార్ నిర్వహించాలని, ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారమయ్యేలా వ్యవస్థ ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. భారీ పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు వెళుతోందన్నారు.

====================

రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి 25 లక్షల రూపాయల వైద్య భీమా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తోందని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. గుంటూరు జిల్లా తెనాలిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో, ఈరోజు 28 మంది లబ్దిదారులకు 15 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ... వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్...34 సెకన్లు)

====================

రైతులకు సకాలంలో పంట నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధ్యక్షతన జిల్లా సమీక్ష కమిటీ సమావేశం ఈరోజు నిర్వహించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టంపై సమావేశంలో చర్చించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలన్నారు.

====================

తుఫాన్ కారణంగా నష్టపోయిన ఆక్వా రైతులను ఆదుకునేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించా రు. గుంటూరు జిల్లా మంగళగిరిలో 20వ రాష్ట్ర మారిటైమ్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ప్రత్యేక సందర్భాల్లో బీచ్ సందర్శనకు భారీగా వచ్చే పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, పర్యాటక శాఖతో సమన్వయం చేసుకొని పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు.

====================

రాష్ట్రంలో బస్సు సర్వీసులను విస్తృతంగా పెంచడం వల్ల పర్యాటక రంగ అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నుంచి విశాఖపట్నంకు మూడు ఆర్.టి.సి ఏసీ బస్ సర్వీస్‌లను మంత్రి కర్నూల్ లో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆటోమేటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్ బస్సులో ఉంటే ప్రమాద సమయంలో ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చని చెప్పారు.

====================

ప్రతీ ఇంటి నుంచి ఒకరు పారిశ్రామిక వేత్తగా ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గంలో 2,203 కోట్ల రూపాయాలతో ఏర్పాటు చేయబోయే ఏడు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి ఉండవల్లి

కార్యాలయం నుండి దృశ్య మాధ్యమ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, పలు సంస్థల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. కుప్పానికి త్వరలో 6,300 కోట్ల రూపాయల పెట్టుబడులతో మరో 8 కంపెనీలు వస్తున్నాయని చంద్రబాబునాయుడు తెలిపారు. ఐటీ ఉద్యోగాలు చేసిన వారిలో కొందరు ఇప్పటికే పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...29 సెకన్లు)

====================

విరామం

====================

అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందని విద్య, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈరోజు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నిర్వహించిన భక్త కనకదాసు 538వ జయంతోత్సవ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, ఎస్.సవిత తో కలిసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నవంబర్ 8న భక్త కనకదాసు జయంతిని కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోందన్నారు. సాధారణ ప్రజలకూ అర్థమయ్యేలా భక్త కనకదాసు.. ఎన్నో కీర్తనలు, గ్రంథాలను రాసి తన జీవితాన్ని శ్రీకృష్ణ పరమాత్మ సేవకు వినియోగించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం బిసీలకు ప్రాధాన్యత ఇస్తూ.. అన్ని జిల్లాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందన్నారు.

====================

మహిళల ఆరోగ్యమే వారి కుటుంబాలకు నిజమైన శ్రేయస్సు అని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరంలో అర్బన్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో మెప్మా పట్టణ మహిళలకు ఏర్పాటు చేసిన సఖి సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించి, వారి ఆర్థిక సుస్థిరతకు సహకరించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

====================

రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా అడవిపాలెంలో 5 కోట్ల రూపాయలతో నిర్మించనున్న రహదారి పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ, వాటి రూపురేఖలను మారుస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటినీ ఏడాదిన్నర కాలంలోనే అమలు చేసామన్నారు. కాలువల మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని మంత్రి రామానాయుడు తెలిపారు.

====================

ఆస్ట్రేలియాలో బ్రిస్బేన్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈరోజు జరిగిన ఐదో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. టాస్ ఓడి బాటింగ్ ప్రారంభించిన భారత జట్టు వర్షం కారణంగా ఆట ఆగే సమయానికి 4.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. వర్షం తగ్గే సూచన లేకపోవడంతో అంపైర్లు ఈ మ్యాచ్‌ను రద్దు చేశారు. దీంతో భారత జట్టు 2-1 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది.

====================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో ఉత్తర, ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు, ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని తెలియజేసింది. మరిన్ని వివరాలను వాతావరణ శాఖ అధికారి ఎం.వెంకటరావు  వెల్లడిస్తూ...

(వాయిస్...22 సెకన్లు)

====================

====================